క్లుప్తంగా

యోగాతో మానసికోల్లాసం

ముదినేపల్లిరూరల్: ప్రతి రోజు యోగా సాధన చేయడం ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని ఉపాధ్యాయులు చెప్పారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతి నెలా 3వ శనివారం విద్యార్థులకు మానసి కోల్లాసాన్ని, ఏకాగ్రతను పెంచేందుకు యోగా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కాకరవాడ ఎంపీయూపీ, పెయ్యేరు, వడాలి పాఠశాలల్లో యోగా శిక్షణ తరగతులు చేపట్టారు.

గురజలో రక్తదానం



ముదినేపల్లిరూరల్: మండలంలోని గురజ పీహెచ్‌సీలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి తరుణి ఆధ్వర్యంలో చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం నిర్వాహకులు శిబిరాన్ని చేపట్టారు. శిబిరంలో గ్రామానికి చెందిన పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలను అభినందించారు. గుడివాడ ఏరియా హాస్పిటల్ రక్తనిధి సిబ్బంది పర్యవేక్షించారు. శిబిరంలో లింక్ వర్కర్స్ జన్ను చంద్రావతి, సీహెచ్ నాగలక్ష్మి, పి.దేవి, బి.సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే సహించం



గుడివాడరూరల్: ప్రజాధారణ కలిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)లను విమర్శించే స్థాయి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులకు లేదని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీ హెచ్చరించారు. స్థానిక యువజన విభాగం కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కాళీ మాట్లాడుతూ పేదలకు ఇచ్చే టిడ్కో ఇళ్ల పంపిణీ కార్యక్రమం వాయిదా పడితే సంబరాలు చేసుకుని పైశాచిక ఆనందం పొందిన టీడీపీ నేతలకు శుక్రవారం జరిగిన సీఎం కార్యక్రమాన్ని చూసి కళ్లు బైర్లు కమ్మాయన్నారు. సభకు వచ్చిన జనాలను చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. 30 ఏళ్ల రావి కుటుంబ రాజకీయ జీవితంలో గుడివాడకు చేసింది ఏమీ లేదన్నారు. ప్రజలకు అన్ని రకాలుగా సేవలు చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నానిపై అవాకులు, చవాకులు పేలితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. జిల్లా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ రాజేష్, మామిళ్ల రాజేష్, ఆలీబేగ్ పాల్గొన్నారు.

బాబా మందిర వార్షికోత్సవం

మండవల్లి: స్థానిక షిర్డీ సాయిబాబా మందిర 13వ వార్షికోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. విజయవాడకు చెందిన సాయి అఖండ జ్యోతి వ్యవస్థాపకుడు రాంజీ గురువు ఆధ్వర్యంలో విశేష హోమాలు నిర్వహించిన అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేపట్టారు.

గ్రామ స్థాయిలోనే పౌర సేవలు

- ఇచ్చిన హామీ అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ప్రజలకు వరంలా సచివాలయ వ్యవస్థ
- గడప వద్దకే అన్ని రకాల ప్రభుత్వ సేవలు

గుడివాడరూరల్: పౌర సేవలను గ్రామ స్థాయిలోనే ప్రజలకు సులువుగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రవేశపెట్టిన సచివాలయాల వ్యవస్థ ప్రజలకు వరంలా మారింది. అన్ని రకాల ప్రభుత్వ సేవలను ఒకచోటే అందించే విధంగా ఏర్పాటు చేసిన సచివాలయాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రజలు పౌర సేవల కొరకు కాళ్లు అరిగేలా తిరిగే రోజులు పోయాయి. అవినీతికి తావు లేకుండా ప్రజల వద్దకే సేవలు సచివాలయాలు అందిస్తుండటంతో ప్రజలకు పౌర సేవలు సులువయ్యాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడంతో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది సమయంలోనే ఆత్యాధునిక సౌకర్యాలతో గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటయ్యాయి.

శరవేగంగా భవన నిర్మాణాలు..

గుడివాడ నియోజకవర్గంలో 38 సచివాలయ భవనాల నిర్మాణాలకు ఒక్కో సచివాలయ నిర్మాణంకు రూ.40 లక్షల చొప్పున ప్రభుత్వం రూ.15.20 కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణాలు సైతం శరవేగంగా జరుగుతున్నాయి. భవనాల నిర్మాణ విషయంలో నాణ్యతా ప్రమాణాల్లో రాజీలేకుండా చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సైతం ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపి అధికారులతో సచివాలయ నిర్మాణాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించడంతో భవన నిర్మాణాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి.



గుడ్లవల్లేరు మండలంలోని చంద్రాల గ్రామ సచివాలయం

అన్ని సేవలు ఒకే చోట..

గతంలో ప్రజలు పౌర సేవలు పొందాలంటే గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వెళ్లి అధికారుల కోసం వెళ్లి పడిగాపులు కాయాల్సి వచ్చేది. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, పెన్షన్ల మంజూరుకు నానా అవస్థలు పడేవారు. నెలల తరబడి ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉండేవి. ధ్రువీకరణ పత్రాలకు అధికారులకు ముడుపులు ఇవ్వకుంటే పని జరగని దుస్థితి. ముఖ్యంగా నిరుపేద ప్రజలకు పౌర సేవలు అందని ద్రాక్షలా మారాయి. అధికారులు సైతం ఎప్పుడు వచ్చి ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్థాయిలో ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందే అన్ని సేవలు ఒక చోటే చేకూరే విధంగా సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు.



సచివాలయంలో సేవలు అందిస్తున్న ఉద్యోగులు(ఫైల్)

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు..

సచివాలయాల ద్వారా ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. అధికారులందరూ సచివాలయాల్లోనే అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో పౌర సేవలు ప్రజలకు అందుతున్నాయి. వలంటీర్లను ఏర్పాటు చేసి వారిని సచివాలయాలకు అనుబంధం చేయడంతో ప్రజలకు ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతున్నాయి. గతంలో పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పంచాయతీ కార్యాలయాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ప్రతి నెల 1వ తేదిన ఉదయం ఇంటి తలుపు తట్టి మరీ పెన్షన్లు ఇస్తుండటంతో పెన్షన్‌దారుల మొఖాల్లో నవ్వులు చిగురుస్తున్నాయి. రెవెన్యూ పరమైన సేవల కొరకు మండలకేంద్రాలకు వెళ్లే దుస్థితి లేకుండా సచివాలయాల్లోనే గ్రామస్థాయిలో సేవలు అందేలా చేయడంతో రైతులు, విద్యార్థులకు మేలు జరుగుతుంది. అధికారుల కోసం వేచి చూసే పని లేకుండా అధికారులే సేవల కోసం వచ్చే ప్రజల కోసం ఎదురు చూసే పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చింది.

నిద్ర లేవక ముందే పెన్షన్..



గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ కోసం పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి కళ్లు కాయలు కాసేలా చూసేవాళ్లం. రోజుల తరబడి పెన్షన్ కొరకు ఎదురు చూసిన రోజులున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి నెల 1వ తేదీ తెల్లవారు జామునే నిద్ర లేవకముందే తలుపు తట్టి వలంటీర్లు ఇంటికి వచ్చి పెన్షన్‌ను అందచేస్తున్నారు. పెన్షన్ల కొరకు ఇబ్బందులు పడే రోజులు పోయాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పెన్షన్‌దారులు రుణపడి ఉంటాం.

–కళ్లేపల్లి జయలక్ష్మి, వృద్ధురాలు గుడివాడ

సులువుగా రెవెన్యూ సేవలు..



పట్టాదార్ పాస్‌పుస్తకాలు, రెవెన్యూ పరమైన అవసరాలకు మండల కేంద్రాలు, డివిజన్ కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు గతంలో రోజుల తరబడి తిరిగేవాళ్లం. కనీసం శిస్తు చెల్లించాలన్నా అధికారుల చుట్టూ తిరిగాల్సి వచ్చేది. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత అన్ని రకాల రెవెన్యూ సేవలు గ్రామాల్లోనే అందుతున్నాయి. లంచాలు ఇవ్వకుండా రెవెన్యూ సేవలు పొందే రోజులు రావడం ఆనందంగా ఉంది. ఇదే వ్యవస్థ కొనసాగితే రైతులకు మేలు జరుగుతుంది.

–పెన్నేరు ప్రభాకరరావు, రైతు, వల్లమన్నాడు, గుడ్లవల్లేరు మండలం

విద్యాభివృద్ధికి కేరాఫ్ సీఎం వైఎస్ జగన్

కైకలూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులను ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా టెన్త్, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు నగదు, సర్టిఫికెట్, మెడల్‌తో శనివారం సత్కరించారు. పదో తరగతి విద్యార్థులకు రూ.40 వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.60 వేలు నగదు బహుమతులు అందించారు. కైకలూరు ఎంఈవో డి.రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజాభివృద్ధికి కేవలం విద్య మాత్రమే దోహదపడుతుందన్నారు. ఎంపీపీలు అడవి కృష్ణ, రామిశెట్టి సత్యనారాయణ, కైకలూరు వ్యవసాయ మార్కెట్ అధ్యక్షురాలు దండే పుష్పలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు జంపన కొండరాజు, నేతలు భట్రాజు శివాజీ, చెరుకువాడ బలరామరాజు, ఈడే వెంకటేశ్వరరావు, దండే రవిప్రకాష్, మెండా సురేష్ బాబు, ప్రిన్సిపాల్ రవీంద్ర, ఎంఈవో నరేష్ కుమార్, హెచ్‌ఎంలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తూ పలు రకాల ప్రోత్సాహకాలను అందజేస్తోందని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వడాలి జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పురస్కారాలను శనివారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు వి.ప్రభుదాస్, సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు బంగారు, వెండి, కాంస్య



పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



మాట్లాడుతున్న ఎంపీపీ రామిశెట్టి

పతకాలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎంపీటీసీ మరీదు నాగయ్య, ఈడే వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: పెంజెంద్ర జెడ్పీ హైస్కూల్లో గతేడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పతకాలను అందించారు. ఎస్‌ఎంఎస్ చైర్మన్ జె.రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కైకలూరు: జగనన్న ఆణిముత్యాలులో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదివిన ఆనందరావుపేటకు చెందిన దండే సైమన్‌రాజు కుమారుడు హెడెన్‌ను వైఎస్సార్ సీపీ నాయకుడు బొడ్డు నోబుల్ శనివారం సన్మానించారు. ఇంటర్ బైపీసీలో మొదటి ర్యాంకు సాధించడంతో హెడెన్‌కు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి, సత్కరించారు. కుర్రేళ్ల ఇస్సాకు, బొడ్డు ఏసుబాబు, జీవరత్నం, కంచెర్ల ఏసుబాబు, బొడ్డు సుధాకర్, అహరోను, సంతోషకుమారి పాల్గొన్నారు.

స్వధార్ గృహాలను సద్వినియోగం చేసుకోవాలి

నిమ్మకూరు(పామర్రు): జిల్లా మహిళా ప్రాంగణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వధార్ గృహాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణాజిల్లా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ, డీఎల్‌ఎస్‌ఏ సీనియర్ జడ్జి కె.వి.రామకృష్ణయ్య అన్నారు. నిమ్మకూరు గ్రామంలోని నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి అనంతరం అక్కడ ఉన్న స్వధార్ గృహాల్లోని మహిళలతో కొద్ది సేపు ముచ్చటించారు. భోజనం, వసతి సదుపాయాలు, వారి బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ–ఎస్ఈఈడీఏపీ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న సీనియర్ బ్యూటీ థెరపీస్ట్ కోర్సు శిక్షణ తీసుకుంటున్న మహిళలతో శిక్షణ కార్యక్రమం గురించి ఆరా తీశారు.



మాట్లాడుతున్న సీనియర్ జడ్జి రామకృష్ణయ్య

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా చట్టాల గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. న్యాయపరమైన చిక్కులు ఏర్పడినప్పుడు వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. స్వధార్ గృహాల్లో ఉండే మహిళలకు ప్రభుత్వం అన్ని రకాల వసతులను అందిస్తోందని చెప్పారు. ప్లీడర్ మునలయ్య, బ్యూటీ థెరపీస్ట్ శిక్షణ పొందుతున్న మహిళలు, ప్రాంగణం సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: సమాజ సేవను లయన్స్ క్లబ్ సభ్యులు సాంఘిక బాధ్యతగా తీసుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పామర్రు కైలే అనిల్‌కుమార్ కోరారు. స్థానిక విజయవాడ రోడ్డులోని బొమ్మారెడ్డి సీతారెడ్డి కల్యాణ మండపంలో పామర్రు లయన్స్ క్లబ్ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కైలే పాల్గొని మాట్లాడుతూ.. సేవలను మరింతగా విస్తృత పర్చాలన్నారు. సమాజంలో మెరుగైన సేవలను అందిస్తూ జిల్లా స్థాయిలో ఉత్తమ క్లబ్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. సేవ అనేది వంశ పారంపర్యంగా వచ్చేది కాదని హృదయ స్పందన మధ్య ఉద్భవిస్తుందని తెలిపారు. అనంతరం లయన్స్ జిల్లా 316 డి గవర్నర్ దామర్ల శ్రీ శాంతి క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. పామర్రు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా పీఎంఎస్ ప్రసాద్, సెక్రటరీ ఎం.మధుసూదనరావు,



ఎమ్మెల్యే కైలేను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కోశాధికారి ఎస్ వీర వెంకయ్య, సహాయ కార్యదర్శి బి.స్వర్ణలత తదితరులు ప్రమాణం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను పామర్రు లయన్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు. పామర్రు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు లంకపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ కె.చంద్రశేఖర్, లయన్స్ నేతలు బి.వి.అప్పారావు, తోట రమేష్, పసుపులేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన పెనుప్రమాదం



పెదపారుపూడి: ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు పక్కనే ఉన్న డ్రెయిన్‌లో దూసుకెళ్లిన సంఘటన మండల కేంద్రమైన పెదపారుపూడిలో శనివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం విజయవాడ నుంచి గుడివాడ వస్తున్న ఆర్టీసీ బస్సు పెదపారుపూడి పొలిమెర సమీపంలోకి రాగానే ఎదురుగా ఉన్న ఆటో సడన్ బ్రేక్ వేయటంతో బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న మురుగు డ్రెయినేజీ కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న 68 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుడివాడ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పెను ప్రమాదం తప్పటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అంగన్‌వాడీలతో చిన్నారులకు ఉజ్వల భవిష్యత్

పామర్రు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలతో చిన్నారులకు ఉజ్వల భవిష్యత్‌కు ఏర్పడుతుందని పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 20వ వార్డులో మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాణి, సిబ్బంది శ్రీదేవి, లక్ష్మి, సుజాత, లత, నాంచారమ్మ, తల్లులు పాల్గొన్నారు.

కనుమూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ర్యాలీ, గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఎంపీటీసీ వై.పావని, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.పుష్పావతి, కె.ప్రసన్న, హెల్పర్స్ అమరేశ్వరి, జె.శోభనాకుమారి, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.



పామర్రు ర్యాలీలో పాల్గొన్న వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సిబ్బంది

అప్పికట్ల(పెదపారుపూడి): తల్లిదండ్రులు చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐడీసీఎస్ సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి చెప్పారు. మండలంలోని అప్పికట్లలో గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందజేత



సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



నగదు అందజేస్తున్న జ్ఞానమణి తదితరులు

కైకలూరు(కలిదిండి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కలిదిండి మండలం వెంకటాపురంలో సర్వం కోల్పోయిన మూడు కుటుంబాలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. తక్షణ అవసరాల నిమిత్తం నగదు, వస్త్రాలను అందించారు. ఎంపీపీ ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

భట్లపెనుమర్రు(మొవ్వ): అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, మాజీ జెడ్పీటీసీ కైలే జ్ఞానమణి పేర్కొన్నారు. ఇటీవల మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామంలోని మల్లిఖార్జునపురంలో జరిగిన అగ్నిప్రమాదంలో 4 పశువులు, ఇంటిలోని నగదు, బంగారం, వస్తువులు కోల్పోయిన నడగల శ్రీనివాసరావు కుటుంబాన్ని కైలే జ్ఞానమణి మొవ్వ మండల జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిరలతో కలిసి పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. వారికి పక్కా గృహ మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మొవ్వ మండలం చినముత్తేవిలో అగ్నిప్రమాదానికి గురైన గారపాటి పండుబాబు, గారపాటి వెంకటస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20 వేలు నగదు అందించారు. సర్పంచ్ మట్టా ఇందిరా, పార్టీ మండలాధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, వెంకటరత్నం, నాయకులు పాల్గొన్నారు.

కైకలూరు(కలిదిండి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కలిదిండి మండలం వెంకటాపురంలో ముగ్గురు సోదరులకు చెందిన తాటాకు ఇళ్లు అగ్నికి గురువారం ఆహుతయ్యాయి. తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ సీతారామాంజనేయ చౌదరి ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున రూ.30 వేలు నగదు శనివారం పంపించారు. కీర్తి రాంప్రసాద్ నగదును అందించారు. సర్పంచ్‌లు శ్రీనివాసరావు, వెంకటస్వామి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సవాల్

పమిడిముక్కల: మండల వ్యాప్తంగా జరిగిన అభివృద్ధి పనులపై చర్చకు తాము సిద్ధమని వైఎస్సార్ సీపీ నాయకులు సవాల్ విసిరారు. టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా కృష్ణాపురంలో రోడ్ల సమస్య మీద ధర్నా చేసి అవాకులు, చవాకులు పేలడాన్ని తీవ్రంగా ఖండించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ కాసాని వేద సుప్రజ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. వైస్ ఎంపీపీ గంజాల సీతారామయ్య మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కైలే సహకారంతో 30 ఏళ్లుగా టీడీపీ చేయలేని పనులు తాము చేసి చూపిస్తున్నామన్నారు. అభివృద్ధిపై చర్చకు టీడీపీ నాయకులు ఎక్కడికి వస్తారో చెప్పాలన్నారు. మండల సచివాలయాల కన్వీనర్ పరసా జగన్, నాయకుడు పాతూరి చంద్రపాల్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేపై అవినీతి, అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపీటీసీ గుర్విందపల్లి వంశీ, సర్పంచ్ కలపాల రాంబాబు, నాయకులు మారపాక మహేష్, దియానత్ అలీ, అక్కినేని సతీష్, బండ్రపల్లి శ్యామ్, యార్లగడ్డ శివ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

పామర్రు: మండల పరిధిలోని పామర్రు, జమీదగ్గుమిల్లి, రాపర్ల తదితర గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పంట బోదెల్లో మట్టి పూడికతీత పనులు, జమీదగ్గుమిల్లిలో స్థానిక శ్మశానం వద్ద ఉన్న ముళ్ల కంపల తొలగింపు పనులు చేస్తున్నారని పామర్రు ఏపీవో పోలు రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో 4,590 మంది ఉపాధి కూలీలు పనులు నిర్వహించారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మేట్లు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

గుడివాడరూరల్: రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సిపాన శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ నందు ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండీషన్స్ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేస్తున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా అనేక శిక్షణ కార్యక్రమాలు ఇస్తున్నారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.ధర్మేంద్ర, ట్రైనింగ్ ఆఫీసర్ డి.ఆనంద్‌వేణు, జీఎస్ నరసింహాచారి, కె.జయరామ్, అధ్యాపకులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న శ్రీనివాసరావు తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ సురేష్

వెంట్రప్రగడ(పెదపారుపూడి): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ1, 2 సచివాలయాలను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీపీ సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎంత మందికి లబ్ధి చేకూరుందో సచివాలయాల ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్, మండల సచివాలయాల కన్వీనర్ జాజుల చిన్నారి పాల్గొన్నారు.